అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- గాంధారి పరిధిలో దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ప్యాచ్ వర్కులు కూడా చేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



బ్రాహ్మణ్‌పల్లి-రాంలక్ష్మణ్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డు



గుంతలతో దర్శనమిస్తున్న గాంధారి-గుర్జాల్ రోడ్డు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి. కల్వర్టుల వద్ద కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రధానంగా గాంధారి నుంచి లింగంపేట్ వెళ్లే రోడ్డు గుంతలు పడి ఘోరంగా తయారైంది. రోడ్డు బాగా లేదనే కారణంతో ఆర్టీసీ బస్సు ట్రిప్పులు కూడా తగ్గించారు. ఆటోలు కూడా నడపడంలేదు. రాత్రి పూట రోడ్డులో బైక్‌లపై వెళ్లా లంటే భయపడుతున్నారు. గాంధారి నుంచి దుర్గం, బీర్మల్ మార్గంతో పాటు గాంధారి నుంచి బూర్గుల్ వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



రోడ్డు బాగాలేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. గుంతల కారణంగా బస్సులు, ఆటోలు సరిగ్గా నడపడం లేదు. బైక్‌లు ఉన్న వారు ఏదో విధంగా వెళ్తున్నారు. కాని మహిళలు, పిల్లలు ఎక్కడికైనా వెళ్లాలంటే కష్టంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కనీసం మరమ్మతులు చేయాలి.

– బక్కోల్ల కిష్టయ్య, బ్రాహ్మణ్‌పల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు బాగా లేకపోయినా అవసరాల కోసం గాంధారికి రావాల్సిందే. బస్సులు, ఆటోలు సరిగా నడపడం లేదు. రాత్రి అయితే ఇంటికి చేరే వరకు భయమే. గుంతల రోడ్డులో బైక్‌లు ఎక్కడ, ఎప్పుడు ప్రమాదానికి గురవుతాయో తెలియదు. మరమ్మతులు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– వంజరి శ్రీనివాస్, గుర్జాల్

ప్రమాదకరంగా గుంతలు.. అదుపు తప్పితే అంతే



పెద్ద టాక్లీ వద్ద రహదారిపై గుంత



లింబుర్ వద్ద ఎత్తుగా ఉన్న కల్వర్టు



సిర్‌పూర్ వద్ద సైడ్‌వాల్ లేని వంతెన

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ-సిర్‌పూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టుల వద్ద గల గుంతలు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని పెద్ద టాక్లీ, లింబుర్, చిన్న టాక్లీ గ్రామాల సమీపంలో రహదారిపై కల్వర్టుల వద్ద కాంట్రాక్టర్ బీటీ వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై కల్వర్టులు ఎత్తుగా నిర్మించడంతో పాటు రోడ్డు వేయకపోవడంతో ప్రయాణం కష్టంగా మారింది. కల్వర్టుల వద్ద పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో రాత్రి సమయాల్లో గుంతలను గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టులకు సైడ్‌వాల్ కూడా నిర్మించలేదు. అధికారులు స్పందించి కల్వర్టుల వద్ద గుంతలను పూడ్చి, అక్కడ బీటీ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి గోవింద్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి గోవింద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట పీహెచ్‌సీలో డాక్టర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వ్యాధులు ఎలా ప్రబలుతాయో వివరించాలన్నారు. అలాగే డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యులు రాంబాయిని సన్మానించారు.

పారిశుధ్య పనులు కొనసాగించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ప్రతీ రోజూ పారిశుధ్య పనులు కొనసాగించాలని ఎంపీడీవో నరేష్ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం డ్రై డే సందర్భంగా మండలంలోని ప్రతీ గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎంపీవో మలహరి, కార్యదర్శులున్నారు.

ఏ నిమిషాన పెచ్చులూడి మీద పడునో..



నస్రుల్లాబాద్: నెమ్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం చూస్తే.. ఏ నిమిషాన ఏమి జరుగునో.. ఎవరూహించెదరు.. అనే పాత సినిమాలో పాట గుర్తుకు వస్తోంది. జీపీ భవనం శిథిలావస్థకు చేరింది. నిత్యం పెచ్చులూడి పడుతున్నాయి. గ్రామ పంచాయతీ భవనం నిర్మించి దశాబ్దాలు పూర్తి అవుతోంది. ఎప్పుడు పెచ్చులు ఊడిపడుతుందోనని సిబ్బంది భయంతో వణికి పోతున్నారు. రెవెన్యూ సదస్సుల పరిశీలనలో భాగంగా ఈ భవనానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వచ్చారు. సదస్సు పూర్తి చేసుకుని వెళ్లారే కాని శిథిలావస్థలో ఉన్న భవనం గురించి ఆలోచన చేయక పోవడం గమనర్హం.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



దోమకొండ: కామారెడ్డి నియోజకవర్గంలో తన సొంత నిధులతో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవన పనులను ఆయన ప్రారంభించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట మేరకు సొంత నిధులతో పనులు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, చాముండేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దారెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



బీబీపేట: మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం మండల గ్రామ పంచాయతీ సిబ్బంది మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ నిర్వహణ భారంగా మారిందని, ఇప్పటికైనా ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేస్తాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్లాస్టిక్‌తో తయారు చేసిన ఎలాంటి వస్తువులనైనా వాడబోమని విద్యార్థులు అన్నారు. కృష్ణాజీవాడి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వస్తువులను వాడబోమని ప్రమాణం చేశారు. దాదాపు 190 మంది విద్యార్థులు ప్లాస్టిక్ బాటిల్ కాకుండా స్టీల్ బాటిల్‌లలో తాగునీరు తెచ్చుకొని పర్యావరణ మిత్రులుగా ఉంటామన్నారు. అదేవిధంగా పాఠశాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచుతామని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. హెచ్ఎం రామస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘమేశ్వర్‌లో గ్రామస్థాయి జన సురక్ష



దోమకొండ: సంగమేశ్వర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మాచారెడ్డి, స్వచ్ఛంద సేవా సంస్థ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌పర్మేషన్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. ఆర్‌బీఐ, కెనరా బ్యాంక్ సౌజన్యంతో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. బ్యాంకుల్లో సేవలు, పింఛన్ పథకాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. దోమకొండ కెనరా బ్యాంక్ మేనేజర్ హిమ బిందు, గ్రామపంచాయతీ కార్యదర్శి సంతోష్, ఐకేపీ ఏపీఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వాగత్' కార్యక్రమం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో నూతనంగా చేరిన ఆరో తరగతి విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇదివరకు ఎక్కడా కూడ ఆరో తరగతి విద్యార్థులకు స్వాగత్ కార్యక్రమం ఏర్పాటు చేయలేదని, మోడల్‌స్కూల్‌లో స్వాగత కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరును తీసుకురావాలని ఆయన సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్, నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాబాలలో మద్యానికి అనుమతి లేదు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న దాబాలలో మద్యం తాగడానికి అనుమతి లేదని, ఎవరైనా మద్యం సేవిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేందర్ హెచ్చరించారు. మంగళవారం దాబాలలో మద్యం విక్రయిస్తున్న నలుగురిని తహసీల్దార్ దశరత్ ముందు బైండోవర్ చేశారు.

అటవీ ప్రాంతంలో ట్రెంచ్ ఏర్పాటు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి అటవీశాఖ రేంజ్ పరిధిలోని కళ్యాణి బీట్‌లో మంగళవారం అటవీశాఖ అధికారులు ట్రెంచ్ తీయించారు. అటవీ భూమి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు అటవీ ప్రాంతం సరిహద్దులో జేసీబీతో ట్రెంచ్ తీయించినట్లు ఎఫ్ఆర్‌వో చరణ్‌తేజ్ తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ శ్రీనునాయక్ తదితరులున్నారు.



బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో..



కామారెడ్డిలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లు

ఘనంగా వైద్యుల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మంగళవారం వైద్యులను సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో గొప్పదని అన్నారు. వైద్యుడు మనిషి రూపంలో ఉన్న దేవుడని కొనియాడారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



రాజంపేట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బండారి శ్రీవల్లిక (అండర్–14) ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. గత నెల 28న జిల్లా స్థాయిలో అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన ట్రయత్లాన్(లాంగ్ జంప్, హై జంప్, 600మీ రన్నింగ్)లో శ్రీవల్లిక ప్రథమ స్థానాన్ని సాధించింది. జూలై 6న వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో శ్రీవల్లిక పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. పాఠశాల పీఈటీ అరుణతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



పిట్లం(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో దేవిసింగ్ సూచించారు. ఆయన మంగళవారం బండపల్లి, మద్దెలచెరువు గ్రామాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. హాజరు పట్టిక, పాఠశాలలో నిర్వహిస్తున్న బేస్ లైన్ టెస్ట్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. హెచ్ఎం సుంక్య, గోపి, సిబ్బంది మధుసూదన్, అరుణ్ కుమార్, జ్యోతిలక్ష్మి, మహేందర్ రెడ్డి, సాయిలు, శ్రీనివాస్, హన్మాండ్లు, లావణ్య, సీఆర్‌పీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలి



మంత్రి సీతక్కతో షబ్బీర్ అలీ, ఇతర నేతలు

భిక్కనూరు: మహిళలు రాజకీయంగా మరింత చైతన్యవంతులు కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో మంత్రి సీతక్కను భిక్కనూరు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బల్యాల రేఖ సన్మానించారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్ద పీట వేస్తుందని, అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ ఉన్నారు.

పింఛన్‌ను బ్యాంకు ఖాతాలో జమ చేయాలి

దోమకొండ: పింఛన్‌ను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో ప్రతినెలా జమ చేయాలని కోరుతూ మంగళవారం మంత్రి సీతక్కకు దోమకొండ మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ కోరారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ నివాసంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు.

అందరి భాగస్వామ్యంతో రామాలయ నిర్మాణం



రామేశ్వర్‌పల్లిలో మాట్లాడుతున్న చంద్రకాంత్ రెడ్డి

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో ప్రజలందరి భాగస్వామ్యంలో రామాలయం నిర్మాణం జరుగుతుండటం హర్షణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలోని రామాలయం పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలందరికి రాముడు ఆదర్శనీయుడని, ఆయన ఆలయం నిర్మాణం చేయడం పూర్వ జన్మ సుకృతంగా గ్రామస్తులందరూ భావిస్తున్నారన్నారు. వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, ప్రతినిధులు సందుగారి రవీందర్‌రెడ్డి, చిన్న భూపతి రెడ్డి, బాపురెడ్డి, బాలురెడ్డి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా మనోహర్‌రావు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్ మనోహర్‌రావుకు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. నాగిరెడ్డిపేట ఎస్సై గత నెల 30న పదవి విరమణ పొందారు. దీంతో స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్ మనోహర్‌రావుకు బాధ్యతలు అప్పగించారు.

కాలభైరవుడి సేవలో ఏఎస్పీ



రామారెడ్డి: ప్రముఖ పుణ్య క్షేత్రం ఇసన్నపల్లి (రామారెడ్డి) శ్రీ కాలభైరవుడిని జిల్లా అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఏఎస్పీకి ఆలయ అర్చకులు సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మూలవిరాట్ కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏఎస్పీ చైతన్యారెడ్డిని ఆలయ ఈవో ప్రభు గుప్తా సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి అర్బన్: నెహ్రూ యువ కేంద్రం, తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ ఉత్సవ్ ఇండియా' పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ పురస్కారాలు పొందారు. 'పంచప్రాణ్' ఉపన్యాస పోటీల్లో హేమవంతిని, తహసీర్‌లు రూ.5వేలు నగదు, పెయింటింగ్‌లో సీహెచ్.మయూరి రూ.1500లు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు పొందినట్లు ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. పీడీ శ్రీనివాస్‌రావు, జాతీయ సేవా పథకం అధికారులు శారద, రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులలో చలనం



సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్: విద్యుత్తు శాఖ అధికారుల నెంబర్లు మారి రోజులు గడుస్తున్నా కూడా సెక్షన్ ఆఫీసులో ఫోన్ నెంబర్లు మార్చడం లేదని జూన్ నెల 29న సాక్షిలో 'అధికారులను సంప్రదించడం ఎలా..?' అన్న కథనానికి అధికారులు స్పందించారు. దీనితో పాత బోర్డుపై నెంబర్లను తీసి వేశారు. కాని కొత్త నెంబర్లు ఎప్పుడు రాస్తారో అంటూ కన్స్యూమర్లు, రైతులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం కరెంటు వివరాలను తెలుసుకోవడానికి వచ్చే రైతులు సంబంధిత అధికారుల వివరాలను వెంటనే బోర్డుపై రాయాలని కోరుతున్నారు.

కోతులు, కుక్కల బెడదను నివారించాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో కోతులు, కుక్కల బెడదను నివారించాలని బీజేపీ నాయకులు మంగళవారం మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఎల్లారెడ్డిలో కుక్కల, కోతుల బెడద వల్ల జనాలు ఇబ్బందులు పడుతున్నారని, వీటి నివారణకు తగిన చర్యలను తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు రాజేష్, కాశీ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత



భిక్కనూరు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒంటెద్దు శేఖర్ కుటుంబానికి బస్వాపూర్ గ్రామ యూత్ ఫర్ యూనిట్ సభ్యులు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. శేఖర్ మృతితో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురైంది. ఈ విషయం తెలుసుకున్న యూనిట్ సభ్యులు రూ.24,200 నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

సంక్షిప్తం

మోకా సర్వే

భిక్కనూరు: గుర్జకుంట గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం మోకా సర్వేను నిర్వహించారు. ఇటీవల గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల మేరకు గ్రామంలో మోకా సర్వే చేపట్టారు. తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు

ఎల్లారెడ్డిరూరల్: ఒకరి హక్కులకు మరొకరు భంగం కలిగించొద్దని రెవెన్యూ అధికారులు అన్నారు. మంగళవారం సబ్దల్‌పూర్‌లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో అందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. గిర్దావార్ శ్రీనివాస్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శారద, పోలీసు అధికారులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

సహకార వారోత్సవాలు

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట సహకార సంఘం పరిధిలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జాతీయ సహకార వారోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. జాతీయ సహకార వారోత్సవాలను ఉద్దేశించి జిల్లా సహకార అధికారి రాంమోహన్ మాట్లాడుతూ.. సహకార సంఘాల బలోపేతానికి సభ్యులు, అధికారులు సహకరించాలన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సూపరింటెండెంట్ భూమయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మురళీధర్‌గౌడ్, మానిటరింగ్ అధికారి కరుణాకర్, అచ్చంపేట సొసైటీ సీవో సంఘమేశ్వర్‌గౌడ్, 13 సొసైటీల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్, అక్కంపల్లి గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తాండూర్, అక్కంపల్లి గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు దేవకుమార్, హైమద్, నాయకులు సంజీవులు, నర్సాగౌడ్, సిద్ధిరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆందోళన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ముందు ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. స్కూల్ ఎలాంటి అనుమతి లేదని, అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని నాయకులు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ శివప్రసాద్, నాయకులు సంపత్‌కుమార్, జస్వంత్, రాజు, తదితరులున్నారు.

బకాయిలు చెల్లించాలని వినతి

కామారెడ్డి టౌన్: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు మంగళవారం సీపీవో శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరయ్యేలా కృషి చేసి ఆపరేటర్లకు చెల్లించాలని కోరారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

రాజంపేట: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ 4వ విడత సామాజిక తనిఖీకి మండల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని మండల పరిషత్ అధికారి రఘురాం కోరారు. స్థానిక రైతు వేదిక భవనంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 01.03.2024 నుండి 31.03.2025 కు సంబంధించి ఉపాధి పనుల రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రత్యేక అధికారి అపర్ణ, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.